చిల్లరతో చిక్కులు.. నాణేలతో గుబులు

- మార్కెట్లో రూ.10, రూ.20 నోట్ల కొరత
- నాణేలను తీసుకోవడానికి నిరాకరిస్తున్న వ్యాపారులు

కర్నూలు న్యూసిటీ: మార్కెట్‌లో ప్రజలు, వ్యాపారులకు చిల్లర కష్టాలు అధికమయ్యాయి. వ్యాపారాలు, క్రయ విక్రయాల్లో రూ.10, రూ.20 నోట్ల కొరత వేధిస్తోంది. అధిక సంఖ్యలో నోట్లు చెలామణిలో లేకపోడంతో జనాలు చిల్లర కష్టాలతో కొట్టు మిట్టాడుతున్నారు. ఈ కష్టాలు అధిగమించడానికి రిజర్వ్‌బ్యాంకు రూ.10, రూ.20 నాణేలను ముద్రించి చలామణిలోకి తెచ్చింది. వాటిపై ప్రజలకు సరైన అవగాహన లేక తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. చాలా చోట్ల డిజిటల్ చలామణీలు చేస్తున్నప్పటికీ కొంతమంది అవగాహన లేని చిరు వ్యాపారులు, బడ్డీ కొట్ల వారు నగదుతో వ్యాపారాలు చేస్తూ చిల్లర కష్టాలతో కుస్తీలు పడుతున్నారు. ఈ నేపథ్యంగా ఎన్నో సంవత్సరాల క్రితం చెలామణిలోకి వచ్చి వాడుక లేక మరుగున పడిన రూ.10, రూ.20 నాణేలు బయటకు వచ్చాయి. వీటిని తీసుకుంటే చెల్లుతాయో లేదో అనే అనుమానంతో పలువురు వ్యాపారులు తటపటాయిస్తున్నారు. మరికొందరు నిర్మొహమాటంగా నిరాకరిస్తున్నారు. దీంతో వాటి చెలమణిలో గందరగోళం నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆర్బీఐ స్పందించింది. ప్రభుత్వం విడుదల చేసిన రూ.10, రూ.20 నాణేలు చెల్లుబాటు అవుతాయని, ఎవరైనా తిరస్కరిస్తే ఫిర్యాదు చేయాలని సూచించింది. క్రయవిక్రయాల్లో నాణేలను నిరాకరిస్తే ఐపీసీ సెక్షన్ 124 కింద ఫిర్యాదు చేయాలని స్పష్టం చేసింది.



దేశీయ కరెన్సీలో పెను మార్పులు

గడిచిన దశాబ్ద కాలంలో దేశీయ కరెన్సీలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. ఒక్క రూపాయి నోటు మొదలుకుని రూ.2 వేల నోటు వరకు భారత కరెన్సీలో విభిన్న రంగులు, డిజైన్లలో నోట్లు చెలామణిలో ఉన్నాయి. నాణేలు మొదలుకుని నోట్ల వరకు వరకు డిజైన్లలో తరచూ జరుగుతున్న మార్పులు ప్రజల్లో పలు సందేహాలకు తావిస్తున్నాయి. ప్రజల్లో నెలకొన్న అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసేందుకు బ్యాంకర్లు, ఆర్‌బీఐ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్‌బీఐ తాజాగా ఓ హెచ్చరికను జారీ చేసింది. ప్రభుత్వం ఆమోదించిన నాణేలను తిరస్కరించడం నేరం అవుతుందని స్పష్టం చేసింది.

చిల్లరతో పెద్ద చిక్కు

నోట్ల రద్దు నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థను ఊగిసలాడించిందనే చెప్పొచ్చు. వెయ్యి రూపాయల నోట్లను రద్దు చేసి కొత్తగా రూ.2 వేల నోట్లను ప్రవేశ పెట్టడం తెలిసిందే. ఆ తర్వాత పాత రూ.500 నోట్లు రద్దు చేసి వాటి స్థానంలో కొత్త డిజైన్ నోట్లను తీసుకొచ్చారు. ఇదిలా ఉండగా నాణేల విషయంలో రూ.10, రూ.20 ప్రవేశపెట్టారు. కొన్ని ప్రాంతాల్లో వాటిని తీసుకునేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. దీంతో బ్యాంకుల్లో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఒక దశలో పది రూపాయల నాణేన్ని బ్యాంకర్లు సైతం నిరాకరించే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం రూ.20 నాణేలు చెలామణిలో పెద్దగా లేవు. రూ.10 నాణేన్ని తీసుకునేందుకు కొంతమంది వెనుకాడుతున్నారు. చాలామంది పేదలు, డిజిటల్ పేమెంట్స్ తెలియని వారు తమ వద్ద నాణేలున్నా చెలామణిలో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది రూపాయల నాణెం తీసుకోకపోవడంతో చిల్లర కోసం అవస్థలు పడుతున్నారు.

కొత్త నాణేలు



రూ.20 నాణెం రూ.10 నాణెం

రూ.20 నాణేలు కాకుండా మిగతా కొత్త నాణేలను అదే విలువ కలిగిన పాత నాణేలతో పాటు బహిరంగ మార్కెట్‌లో ప్రవేశ పెడతారు. రెండు వెర్షన్లు చట్టబద్ధమైనవిగా ఉంటాయి. దృష్టి లోపం ఉన్న పౌరుల దృష్ట్యా కొత్త రూ.1, 2, 5, 10 నాణేలను రిఫ్రెష్ డిజైన్‌తో విడుదల చేశారు. ప్రభుత్వం కొత్త రూ.20 నాణేలను కూడా విడుదల చేసింది. ఈ కొత్త సిరీస్‌లోని నాణేలను దృష్టి లోపం గల వ్యక్తులు సులభంగా గుర్తించేందుకు వీలుగా అనేక విభిన్న లక్షణాలతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ చేసింది. విలక్షణమైన గుర్తులు మాత్రమే గాకుండా నాణేలు ఇప్పుడు పెద్దవిగా ఉంటాయి. వాటిని సులభంగా గుర్తించడానికి డినామినేషన్ పెరుగుదలతో మరింత బరువు పెరిగాయి. అన్ని నాణేల వెనుక వైపు అశోక స్తంభం, సింహాల ముద్ర, హిందీలో సత్యమేవ జయతే అని రాసి ఉంటుంది. ఎడమ పార్శ్వంలో హిందీలో భారత్ అనే పదం ఉంటుంది. కుడి పార్శ్వంలో ఆంగ్లంలో ఐఎన్‌డీఐఏ అనే పదం ఉంటుంది. నాణేనాకి మరోవైపు అంతర్జాతీయ సంఖ్యలో వాటి విలువ ఉంటుంది. రూపాయి చిహ్నం డినామినేషన్ విలువ పైన ఉంచబడుతుంది. నాణెం విలువ పదాలలో ఎగువ కుడి వైపున హిందీలో.. ఎగువ కుడి దిగువ కుడి అంచులలో రివర్స్ ముఖంలో ఆంగ్లంలో ఉంటుంది. రూ.20 నాణెంపై దేవనాగరి లిపిలో బీస్ రుప్యే అని దాని వెనుక ఇరవై రూపాయలు అని ఆంగ్లంలో రాసి ఉంటుంది.

నాణేలన్నీ చెల్లుబాటు అవుతాయి



ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాణేలు రూ.1, 2, 5, 10, 20 అన్నీ చెల్లుబాటు అవుతాయి. రోజువారీ వ్యాపారలు, క్రయవిక్రయాలకు వీటిని నిరభ్యంతరంగా వినియోగించవచ్చు. ప్రస్తుతం రూ.20 నాణేలు అందుబాటులో లేవు. ప్రభుత్వం ఆమోదించిన నాణేలను క్రయవిక్రయాలకు నిరాకరించడం చట్టరీత్యా నేరం. అలాంటి వారిపై ఫిర్యాదులు అందితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు.

– రమేష్‌నాయుడు, మేనేజర్, యూనియన్ బ్యాంక్ అశోక్‌నగర్ బ్రాంచ్

క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించాలి

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్ మండలం కాల్వ బుగ్గ వద్ద ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమలో గురువారం దుర్గంధంతో ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురి కావడం బాధాకరమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాధితులైన ఇద్దరు కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు.

1 నుంచి సాంఘిక నాటక ఉత్సవాలు



మాట్లాడుతున్న పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్: హైదరాబాద్ మహతి క్రియేషన్స్, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో జనవరి 1 నుంచి 3వ తేదీ వరకు సాంఘిక నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. సినీ నటుడు ఉప్పులూరి సుబ్బరాయ శర్మ సారథ్యంలో కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో సాంఘిక నాటక ఉత్సవాలు జరుగుతాయన్నారు. 1వ తేదీ హైదరాబాద్ గువ్వాడ క్రియేషన్స్ వారి మూల్యం, రెండో ప్రదర్శనగా కొలకలూరి సాయి ఆర్ట్స్ వారి జనరల్ బోగీలు నాటికలు ఉంటాయన్నారు. 2వ తేదీన అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం, డీఆర్కేపై నాట్స్ హైదరాబాదు వారి 'ఈ మంచం నాది కాదు' నాటికలు, 3న మహతి క్రియేషన్స్ హైదరాబాదు వారి 'ఉక్కు సంకెళ్లు' నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, సభ్యులు సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్టాంటన్ సేవలు చిరస్మరణీయం

కర్నూలు (టౌన్): కోల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక ఈసీఎం బాలికల ఉన్నత పాఠశాలలో అమెరికా బాప్టిస్టు మిషనరీ రెవరెండ్ స్టాంటన్ 157 జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోల్స్ చర్చి ఫౌండేషన్ అధ్యక్షుడు ఏ.డి.ఏ. లింకన్ మాట్లాడుతూ.. కర్నూలు స్టాంటన్ దొర 40 సంవత్సరాలు ఎన్నో సేవలు అందించారన్నారు. ప్రార్థన ఆలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు నిర్మించారన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు, జామెట్రీ బాక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కోల్స్ చర్చి పాస్టర్ రెవరెండ్ జీవన్, కోల్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, రవికుమార్, రమేష్ సాయి, రెడ్డిపోగు సుస్మిత పాల్గొన్నారు.

8న క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి అండర్ –12 బాలుర విభాగంలో క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్రగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు అర్హులని వెల్లడించారు.

కేపీ నారాయణ సేవలు మరువలేనివి

కర్నూలు(అర్బన్): జిల్లా కురువ సంఘానికి రెండు దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందించిన విశ్రాంత సబ్ రిజిస్ట్రార్ కేపీ నారాయణ మృతి సంఘానికి తీరని లోటని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి అన్నారు. 2010 నుంచి సంఘం నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో ఆయన విరివిగా సేవలు అందించారన్నారు. ఆయన గత కొంతకాలంగా రాయదుర్గంలో కుమారుడు డాక్టర్ మహేష్ వద్ద ఉంటు అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కార్యాలయంలో కేపీ నారాయణ చిత్రపటానికి సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్వామి మాట్లాడుతూ ఈ నెల 6న ఆయన అంత్యక్రియలు కర్నూలు మండలం పూడురు గ్రామంలో నిర్వహిస్తారన్నారు. సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న తదితరులు ఉన్నారు.

విజ్ఞాన పీఠంలో ధన్వంతరి జయంతి



మాట్లాడుతున్న తిరుపతి సాయి

కర్నూలు న్యూసిటీ: నగరంలోని విజ్ఞాన పీఠం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విశ్రాంత తహసీల్దారు తిరుపతిసాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి సాయి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే యోగా, వ్యాయామం, క్రీడలు, శారీరక విన్యాసాలు వంటి కార్యక్రమాలలో పాల్గొనడంతో ఆరోగ్యకరమైన భావిభారత పౌరులుగా ఎదుగుతారన్నారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ నదిని పరిరక్షించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు

కర్నూలు సిటీ: దేశ నాగరికత, సంస్కృతి వికాసానికి, నదులకు అవినాభావ సంబంధం ఉందని, మన దేశానికి సైతం నది నుంచే పేరు వచ్చిందని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. హంద్రీనది దినోత్సవం సందర్భంగా గురువారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. హంద్రీ నదికి ఎంతో చరిత్ర ఉందని, కొన్ని వందల సంవత్సరాలు తాగు, సాగు నీటిని అందించిన నదిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కర్నూలు పట్టణం ఒకప్పుడు నదికి ఒక వైపు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం తుంగభద్ర, హంద్రీ నదుల మధ్య నగరం విస్తరించిందన్నారు. ప్రకృతీ ఏర్పరిచిన నదులను రక్షించుకోగలిగినప్పుడే నగరం సురక్షితంగా ఉంటుందన్నారు. అనంతరం కాలుష్య నియంత్రణ అధికారి పి.వి కిశోర్ రెడ్డి మాట్లాడారు. హంద్రీ నది పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఆర్ ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు అక్తర్ భాను, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రిలో వైద్యులు విధిగా ఓపీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అన్ని విభాగాధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వైద్యసేవకు అన్ని విభాగాల్లో లక్ష్యాలకు మించి పనిచేయాలన్నారు. ఈ–హాస్పిటల్, ఎన్టీఆర్ వైద్యసేవ అమలు పక్కాగా జరగాలని సూచించారు. ఓపీ క్లినిక్ మాడ్యూల్, డిశ్చార్జ్ మాడ్యూల్ అమలుకు హౌస్‌సర్జన్స్, పీజీల సేవలు ఉపయోగించుకోవాలని హెచ్‌ఓడీలకు సూచించారు. వెంటిలేటర్లు కావాల్సిన వారు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఓపీ, ఐపీ, ఎమ్మెల్సీ కేసులకు సంబంధించి వైద్య పరీక్షలు, కేస్‌షీట్ల నిర్వహణ పక్కాగా అమలు చేయాలన్నారు. ఐపీ, ఓపీలలో యూహెచ్‌ఐడీ 11 అంకెల నంబర్ కేస్‌షీట్, ఇన్వెస్టిగేషన్‌లను సరిగ్గా నిర్వహించాలని ఆదేశించారు. రేడియాలజీ విభాగంలో ఎక్స్‌రే క్యాసెట్స్ రీడర్స్ మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. అన్ని విభాగాలకు అత్యవసర మందులను లోకల్ పర్చేజ్ కింద కొనేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. అవసరమైన ఎంఎన్‌ఓలను క్యాజువాలిటీ, ఇతర అత్యవసర విభాగాల్లో పనిచేసేందుకు డ్యూటీ వేయాలని ఆదేశించారు. ఆసుపత్రి వైద్యసదుపాయాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీరాములు, వైస్ ప్రిన్సిపాల్ రేణుకాదేవి, సీఎస్‌ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ హేమనళిని తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు పూర్వ విద్యార్థి రూ. లక్ష విరాళం



పూర్వ విద్యార్థి డాక్టర్ రామ పక్కీరను సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ, మెడికల్ అకాడమీ పూర్వ విద్యార్థి డాక్టర్ రామ పక్కీర దాతృత్వాన్ని చాటుకున్నారు. అకాడమీలో ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు తనవంతుగా రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు గురువారం డైరెక్టర్ ఉమామహేశ్వరప్పకు అధ్యాపకుల చేతుల మీదుగా డాక్టర్ నగదు అందజేశారు. డైరెక్టర్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ ప్రత్యూష, పీడీ చంద్రశేఖర్, అధ్యాపకులు డాక్టర్‌ను సత్కరించారు. తాను విద్యనభ్యశించిన విద్యాలయం అభివృద్ధికి సాయం చేయడం ఆనందంగా ఉందని డాక్టర్ రామపక్కీర తెలిపారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రతిఒక్కరూ తాము విద్యనభ్యశించిన పాఠశాలల అభివృద్ధికి పాటు పడాలని ఆయన పిలుపునిచ్చారు.


సమస్యలను పరిష్కరించాలి



శిథిలమైన రోడ్డును చూపిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం 36, 37, 41వ వార్డుల పరిధిలోని వీకర్‌సెక్షన్ కాలనీ మెయిన్ రోడ్డు ఎల్లమ్మ దేవాలయం నుంచి బీసీ కాలనీ వరకు శిథిలమైన రోడ్లను సీపీఎం ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా న్యూ సిటీ కార్యదర్శి రాముడు మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తుందన్నారు. కాలనీల ప్రజలతో మున్సిపల్ అధికారులు వివిధ రకాల పన్నులు కట్టించుకుంటున్నారన్నారు. అయితే మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫల మవుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అలివేలమ్మ, నాయకులు శ్యామల, సత్యం, జమ్మన్న, అబ్దుల్ రెహమాన్, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న జే.లలితమ్మ

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీ అంగన్‌వాడీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ అన్నారు. కర్నూలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం అమరావతిలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌తో మాట్లాడగా సమస్యలను పరిష్కరించాలన్న ఆసక్తి కనిపించడం లేదన్నారు. గతంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని కోరితే సీఎం దృష్టికి తీసుకెళుతానని చెప్పినట్లు వివరించారు. ఏఐటీయూసీ జిల్లా, నగర కార్యదర్శులు ఎస్.మునెప్ప, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

8న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 8వ తేదీన జిల్లాస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రుద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు అనంతపురం పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 94402 22232 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): ఎన్టీఆర్ వైద్యసేవ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. గురువారం యూనియన్ జిల్లా స్థాయి సమావేశం కర్నూలులో నిర్వహించి ఎన్నికలు జరిపారు. జిల్లా అధ్యక్షులుగా సి.కంభగిరి, గౌరవ ముఖ్య సలహాదారుగా శ్రీధర్ (ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ డిస్ట్రిక్ట్ మేనేజర్), గౌరవ సలహాదారులు టీం లీడర్ టి.హుసేన్‌వలి, జి.శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీప్రసన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ గౌస్, జనరల్ సెక్రటరీ దేవేంద్ర నాయక్, జిల్లా సెక్రటరీ జి.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ రేణుక, ట్రెజరర్‌గా రాజా రమేష్‌బాబు, లక్ష్మీశ్వరమ్మ, సుధాకర్‌బాబు, అయూబ్‌తో పాటు 12 మంది వర్కింగ్ సభ్యులను రాష్ట్ర నాయకులు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

రేపు సుబ్రమణ్య స్వామి కల్యాణోత్సవం

కర్నూలు న్యూసిటీ: సుబ్రమణ్య షష్టి సందర్భంగా శనివారం నగరంలోని ఓల్డ్ సిటీ జమ్మి చెట్టు పక్కన వెలసిన శ్రీ లలితా పీఠంలో లోక కళ్యాణార్థం మామిళ్లపల్లి రాజేష్ శర్మ ఆధ్వర్యంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నట్లు గురు సుబ్రమణ్యం స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతానం కలగని దంపతులకు సంతానం కలగాలనే సంకల్పంతో సాయంత్రం ఉచితంగా ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పెళ్లి కాని యువతీ యువకులకు స్వామివారి పాదాల చెంత ఉంచిన కంకణాలు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు.

ఆర్‌యూ ఘటనపై విచారణ

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో గతవారం జరిగిన ఘటనపై విచారణ జరిగింది. విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ గురువారం వర్సిటీ కాన్ఫరెన్స్‌లో సమావేశమై విచారణ చేపట్టింది. ఆర్‌యూ సీఈ ప్రిన్సిపాల్, కళాశాల ఫ్యాకల్టీని వేర్వేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ విషయమై వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ విచారణ కొనసాగుతుందని, ఇంకా పూర్తికాలేదని చెప్పారు. విచారణ కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు కెనరా బ్యాంకు అవగాహన సదస్సు

కర్నూలు (అగ్రికల్చర్): కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ రుణ పథకాలపై నగరంలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కర్నూలు ఎ.క్యాంప్‌లోని ఉద్యాన భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సదస్సు జరుగుతుందని ఎల్‌డీఎం రామచంద్రరావు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన, ఎంఎస్ఎంఈ రుణాల మంజూరుపై అవగాహన కల్పించడం జరుగుతుందని, వీటికి పెద్ద ఎత్తున రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సినిమా టిక్కెట్ల ధర పెంపుపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): పుష్ప–2 సినిమా టిక్కెట్లను అధిక ధరలకు అమ్మిన థియేటర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినోదాన్ని వ్యాపారంగా మారుస్తున్న సినిమా థియేటర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. పుష్ప–2 సినిమాకు టిక్కెట్ ధర రూ.900 నుంచి రూ.944 వరకు అమ్మడం దారుణమన్నారు. హుస్సేన్‌బాషా, అబ్దుల్లా, సురేష్, ప్రకాష్, సాయి, ఉదయ్, అంజి, అర్యన్ పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులకు స్వెట్టర్లను అందజేసిన డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు (టౌన్): విశాఖపట్నంలోని స్వర్ణభారతి స్టేడియంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ కరాటే జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. స్థానిక సంకల్‌బాగ్‌లోని చిన్మయ మిషన్ విద్యాలయంలోని విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక అయ్యారు. ఎంపికైన క్రీడాకారులను ఆయన గురువారం అభినందిస్తూ స్వెట్టర్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే తప్పనిసరిగా మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలు అవసరమన్నారు. చిన్మయ మిషన్ ప్రిన్సిపాల్ స్వర్ణలత పాల్గొన్నారు.

పర్మినెంట్ చేసే వరకు ఆందోళనలు



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నగర పాలక కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా వేతనాలు పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. జీఓ 63 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తమకు వర్తింపజేయాలని కోరారు.

మేయర్‌ను కలిసిన కార్మికులు

నగర మేయర్ బీవై రామయ్యను కార్మికులు కలిసి సమస్యను వివరించారు. తమ డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 9వ తేదీ నుంచి విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళుతున్నట్లు చెప్పారు. సమ్మె నోటీసు కూడా ఇచ్చినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన మేయర్ సమస్య పరిష్కారం కోసం తమ వంతుగా కృషి చేస్తానన్నారు. కార్మికుల పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అసోసియేషన్ నాయకులు రమేష్, యాసిన్ బేగ్, కె.జానమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. గురువారం సీఆర్ భవన్‌లో జిల్లా కార్యదర్శి సీ.మహేష్ అధ్యక్షతన డీహెచ్‌పీఎస్ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ సభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరతరాలుగా దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల నుంచి ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకానికి నిధులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్‌కు నిధులు కేటాయించకపోవడంతో దళిత కాలనీలు, పేటలు, వీధులు అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ.. దళితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపట ప్రేమను చూపుతున్నాయన్నారు. దళితుల సమస్యలపై డీహెచ్‌పీఎస్ పోరాటాలను చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి బీమలింగప్ప, నాయకులు మునెప్ప,రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లెయిమ్‌లు పరిష్కరించండి

కర్నూలు(సెంట్రల్): స్పెషల్ సమ్మరీ రివిజన్–2025కు సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబర్ 24వ తేదీలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఈఆర్‌ఓలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఎస్ఎస్ఆర్–2025పై కలెక్టర్ ఈఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 24వ తేదీలోపు వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. పరిష్కరించేందుకు వినియోగించిన ఆధారాలను రికార్డుల రూపంలో పొందుపరచుకోవాలన్నారు. ప్రతి ఫైల్లో అప్లికేషన్, ఇచ్చిన నోటీసు, విచారణ నివేదిక, మాట్లాడిన ఉత్తర్వులు ఉండాలన్నారు. బల్క్ అప్లికేషన్లను త్రీమెన్ కమిటీకి సిఫారసు చేయాలన్నారు. జిల్లాకు త్వరలోనే రోల్ అబ్జర్వర్ వచ్చే అవకాశం ఉందని, అంతలోపు అన్ని రికార్డులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలను ఎలా పరిష్కరించాలో కలెక్టర్ తహసీల్దార్లకు విశదీకరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి కారకులను శిక్షించాలి



కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కర్నూలు (సెంట్రల్): అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర సహాయకుడిగా పనిచేస్తున్న ఎస్.ఎజాజ్ అహ్మద్‌పై దాడి చేసి మరణానికి కారకులైన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో చైర్మన్ సెక్రటరీ జనరల్ ఎస్.గోకారి, జి.తిమ్మప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం 5 గంటలకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఉపాధ్యాయుడి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నివాళి అర్పించి జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్య దాడిని ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ నిలువరించే ప్రయత్నం చేయడంతో ఆయనపైనే దాడి చేయగా తీవ్రంగా గాయపడి మరణించాడన్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు మరియానంద, నారాయణ, సేవాలాల్ నాయక్, నవీన్, పాటిల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో మంచి భవిష్యత్తు



మాట్లాడుతున్న జీసీడీఓ స్నేహలత

కల్లూరు: వృత్తి విద్యా కోర్సులతో మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా జీసీడీఓ స్నేహలత అన్నారు. గురువారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వృత్తి విద్యా కోర్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో నైపుణ్యం పెంపొందించగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. వృత్తి విద్యా కోర్సులు పూర్తయిన వెంటనే ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్లు విక్రమ్, ప్రతాప్, వృత్తి విద్యా అధ్యాపకులు మధుసూదన్, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.